క్లుప్తంగా

నేడు కొబ్బరికాయల వేలం

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులో నంబాయ్యగుట్టపై ఉన్న వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు కొబ్బరికాయల విక్రయానికి వేలం పాట నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేలం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన వ్యాపారులు ఉదయం జీపీ వద్ద నిర్వహించే వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

ఉచిత పశువైద్య శిబిరం

షాబాద్: పాడి పశువులకు వచ్చే వ్యాధులపై రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 16 గేదెలకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. 25 గేదెలకు చూడు పరీక్షలు నిర్వహించి, దూడలకు, గేదెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో పశువులకు వైద్యం అందిస్తే అధిక పాల దిగుబడి వస్తుందని తెలిపారు. మేలు రకం పశువుల ఎంపిక ద్వారా అధిక ఆదాయం పొందవచ్చన్నారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే మంచి లాభాలు వస్తాయన్నారు. పాడి పశువుల ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు, డాక్టర్ల సలహాలు తీసుకుని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర విద్యాసాగర్, వైద్య సిబ్బంది శ్రీనివాస్, సుధాకర్, రైతులు తదితరులు ఉన్నారు.

పాఠశాలకు కంప్యూటర్లు, సౌండ్ సిస్టం అందజేత



కంప్యూటర్ల వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

కేశంపేట: మండల పరిధిలోని సంగెం గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలకు సైబరాబాద్ రోటరీ క్లబ్ సభ్యులు రెండు కంప్యూటర్లు, సౌండ్ సిస్టంను మంగళవారం అందించారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని హెచ్ఎం కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజనీ, పుష్పలత, కుమార శెట్టి, ప్రసన్నలక్ష్మీ, శివజ్యోతి పాల్గొన్నారు.

ఉపాధి హామీ మేట్‌కు సన్మానం



వెంకటయ్యను సత్కరిస్తున్న అధికారిణి

షాద్‌నగర్‌రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో మేట్‌గా పని చేస్తున్న ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చింతగూడ గ్రామానికి చెందిన దివ్యాంగుడు వెంకటయ్యను సోమవారం ఘనంగా సన్మానించారు. మహిళా సంఘాలు, ఉపాధి హామీ పథకం వంటి కార్యక్రమాల్లో భాగస్వాములైన దివ్యాంగులతో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో డీఆర్డీఓ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పథకంలో దివ్యాంగుల కోటాలో వందరోజుల పని దినాలను పూర్తి చేసుకున్న వెంకటయ్యను డీఆర్డీఓ శ్రీలత ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఉత్తమ సీసీగా రమేశ్



ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఐకేపీ సీసీ రమేశ్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల సమాఖ్యలో సీసీగా పనిచేస్తున్న రమేశ్‌గా ఉత్తమ సీసీ అవార్డుకు ఎంపికయ్యారు. దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీలత చేతుల మీదుగా రమేశ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి ఉత్తమ అవార్డు అందజేసినందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. విధి నిర్వహణలో మరింత బాధ్యతగా మెలుగుతానన్నారు.

చెరువు.. మరమ్మతులు కరువు

గ్రామాల్లో అధికారుల నిర్లక్ష్యంతో చెరువులు మాయమైపోతున్నాయి. అయినా చూసీచూడనట్లు వ్యవరించడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. మండలంలోని కాశన్నకుంట గత కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో చెరువు మట్టి, కంపచెట్లతో నిండిపోయింది. ఇదే అదునుగా రియల్ వ్యాపారులు చెరువు చుట్టూ పరిశ్రమలు, వెంచర్లు ఏర్పాటు చేసి ఆక్రమిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పరిశ్రమల నిర్వాహకులు రాత్రి, పగలు తేడాలేకుండా కలుషిత జలాలను చెరువులోకి విడుదల చేయడంతో నీరు రంగుమారి చేపలు మృత్యువాతపడ్డాయి. చెరువులోని నీటిని పీసీబీ అధికారులు సేకరించారు. కానీ ఫలితాలు ఇంకా తెలియలేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కాశన్నకుంటకు మరమ్మతులు చేపట్టి, శిఖం కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

- పూడికతో నిండుకున్న కాశన్నకుంట
- పరిశ్రమల వ్యర్థాలతో నీరు కలుషితం
- మృత్యువాతపడుతున్న చేపలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



రంగుమారిన కాశన్నకుంట చెరువులో నీరు



కాశన్నకుంట చెరువులోకి ఆయా పరిశ్రమలనుంచి వస్తున్న కలుషిత నీరు(ఫైల్)

కొత్తూరు: మారుమూల గ్రామాల్లో ఉన్న చెరువులు, ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమించినా, ధ్వంసం చేసినట్లు తెలిసినా వెంటనే ఆయా శాఖలకు చెందిన అధికారులు స్పందిస్తారు. అంతేగాకుండా వాటికి నష్టం కలిగించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటారు. కాగా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న కాశన్నకుంట చెరువులోకి రాత్రి, పగలు తేడాలేకుండా పలు పరిశ్రమల నిర్వాహకులు కలుషిత జలాలను విడుదల చేస్తున్నప్పటికీ పీసీబీతో పాటు ఏ శాఖకు చెందిన అధికారి కూడా కిమ్మనడం లేదు. పలుమార్లు తమ గ్రామంలోని చెరువులోకి కాలుష్య జలాలు వచ్చి చెరువు నీరు కలుషితం అవుతున్నాయని పీసీబీతో పాటు ఆయా శాఖలకు చెందిన అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనికితోడు చెరువుకు సంబంధించిన శిఖం పొలాలు సైతం ఆక్రమణలు, కబ్జాలకు గురవుతున్నట్లు తెలిసినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గత కొన్నేళ్ల నుంచి మరమ్మతులు లేకపోవడంతో చెరువు మట్టి, కంప చెట్లతో నిండుకుంది.

రంగు మారుతున్న నీరు..

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో సుమారు 32 ఎకరాల్లో కాశన్నకుంట చెరువు విస్తరించి ఉంది. ఈ చెరువు కింద ఒకప్పుడు 30 ఎకరాల ఆయకట్టు ఉండేది. వర్షాకాలంలో ఈ చెరువు నిండితే వ్యవసాయ బోర్లే కాకుండా గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే బోర్లలో కూడా నీటిమట్టం పెరిగేది. తద్వారా వేసవిలో కూడా అంతగా నీటి ఇబ్బందులు ఉండేవి కావు. స్థానిక మత్స్యకారులు ప్రతి ఏడాది లక్షలు వెచ్చించి చేపలను సాగు చేసేవారు. కానీ మండల కేంద్రంలో పారిశ్రామిక వాడ ఏర్పాటైన తర్వాత క్రమేణా కొన్ని పరిశ్రమలు కాలుష్య కారకమైన నీటిని వర్షాకాలంలో వరద నీటితో పాటు చెరువులోకి వదిలేశారు. దీంతో ఈ చెరువులోని నీరు మొత్తం కలుషితమయ్యాయి. కలుషిత నీటితో చెరువులోని నీరు రంగు మారిపోయాయి.

కబ్జాలకు గురవుతున్న వైనం..

కాశన్నకుంట చెరువుకు చుట్టూ పరిశ్రమలు, రియల్ వెంచర్లు ఏర్పాటవుతున్నాయి. ఇదే అదునుగా భావిస్తున్న కొందరు అధికారులు, స్థానిక నాయకులకు ముడుపులు చెల్లిస్తూ యథేచ్ఛగా శిఖం పొలాన్ని కబ్జాలు చేసి ఆక్రమిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేగాకుండా చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన ఓ వెంచర్ వర్షాకాలంలో చెరువు నీటితో నిండుకుంటుందంటే అధికారుల పనితీరు ఇట్టే అర్థమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

పట్టించుకోని అధికారులు..

నిబంధనల ప్రకారం చెరువు ఎఫ్‌టీఎల్ లెవల్(నీటి పరివాహక ప్రాంతం)లోపు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. కాగా ఇక్కడ మాత్రం ఏర్పాటు చేసిన వెంచర్ చెరువు నీటితోనే నిండుకుంటుంది. ఇక పలువురు వ్యాపారులు యథేచ్ఛగా చెరువు శిఖంను ఆక్రమించారు. ఈ విషయాలను ఎప్పటికప్పుడూ ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా వారు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



కాశన్నకుంట చెరువుకు మిషన్ కాకతీయ పథకంలో భాగంగా మరమ్మతులు చేపట్టాలి. అప్పుడే కబ్జాలు, ఆక్రమణలు చేసిన వైనం బయటపడుతుంది. గత కొన్నేళ్ల నుంచి మరమ్మతులు లేకపోవడంతో చెరువు మట్టి, కంప చెట్లతో నిండుకుంది.

– తుప్పర రవీందర్, ఎస్సీ కాలనీ, కొత్తూరు

పీసీబీ శాంపిళ్లు సేకరించారు



గత రెండు నెలల క్రితం స్థానికులు, మత్స్యకారుల ఫిర్యాదుతో కాశన్నకుంట చెరువులోని నీటిని పీసీబీ అధికారులు సేకరించారు. కాగా వారి నుంచి ఫలితాలు వచ్చిన తర్వాతే పరిశ్రమల నుంచి కలుషిత జలాలు చెరువులో కలుస్తున్నాయా, లేదా అనే విషయాలు తెలుస్తాయి. పట్టణంలోని మురుగు కాల్వల ద్వారా మురుగునీరు చెరువులోకి పారుతోంది. నీటి ప్రవాహాన్ని దారి మళ్లించాలని మున్సిపల్ అధికారులకు లేఖ రాశాము.

– రవీందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ, కొత్తూరు

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో ఆదివారం రాత్రి అయ్యప్ప స్వామి మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వామి గిరిషన్‌నాయర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్ధరాత్రి పడివందనం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కన్యస్వాములతో పరిగి రోడ్డులోని పోచమ్మ దేవాలయం నుంచి శివ మారుతీ గీతా అయ్యప్ప మందిరం వరకు మహాదీపారాధనతో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో కేరళ మేళతాళాలు, వాయిద్యం, ఆటాపాటలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

వసతి గృహాలకు భవనాలు నిర్మించాలి



ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా, వినతి

చేవెళ్ల: కళాశాల విద్యార్థులకు సంబంధించి మంజూరైన వసతి గృహాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం కళాశాల విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్లలో 2018లో ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాలు మంజూరైనట్లు చెప్పారు. అప్పటి నుంచి వీటికి సొంత భవనాలు లేకపోవటంతో అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని, అద్దె భవనాల్లో సౌకర్యాలు లేకపోవటంతో ఇటీవల పాఠశాల విద్యార్థులు ఉండే వసతి గృహంలోకి మార్చారన్నారు. అక్కడ పాఠశాల, కళాశాల విద్యార్థులకు గదులు, సౌకర్యాలు సరిపడకపోవటంతో మరింత ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు వెంటనే సొంత భవనాలు మంజూరు చేయించి నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ నాయకులు సమీర్, చందు, చరణ్‌గౌడ్, అనిల్‌కుమార్, నవీన్, సందీప్, ఆసిఫ్, శివ, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళ్లిన, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం చౌదరిగూడ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సునిత ఆధ్వర్యంలో కాంప్లెక్స్ పరిధిలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన 21 మంది ఉపాధ్యాయులకు సోమవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చౌదరిగూడ ఉన్నత పాఠశాలలో వారికి శాలువా, పూలమాలలతో సన్మానించారు. అదేవిధంగా నూతనంగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన ఎంఈఓ కిష్టారెడ్డి, చౌదరిగూడ పీఎస్ హెచ్ఎం నీలా మోహన్‌నాయక్‌తో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో అన్ని రంగాల్లో వెనుకబడిన మాదాసి, మాదారి కురువల అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆ సంఘం తాలుకా అధ్యక్షుడు విఠలయ్య డిమాండ్ చేశారు. సోమవారం మాదాసి, మాదారి కురువలను ఎస్సీ వర్గీకరణలో భాగంగా ఏ జాబితాలో చేర్చాలని కోరుతూ సంఘం నాయకులు ఏక సభ్య విచారణ కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీం అక్తర్‌ను సచివాలయంలో కలిసి వినతిపత్రం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విఠలయ్య మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, వెనుకబాటు కారణంగా విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లలో మాదాసి కురువలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణలో భాగంగా తమను ఏ జాబితాలో చేర్చే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో సంఘం నాయకులు శివరాములు, లక్ష్మయ్య, నర్సింలు, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

రోడ్డుపై విరిగిపడిన మర్రిచెట్టు కొమ్మ



రోడ్డుపై వేలాడుతూ వాహనదారులకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మ

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై ఉన్న మర్రిచెట్టు కొమ్మ రోడ్డుపై విరిగిపడి వాహనాదారులకు ప్రమాదకరంగా మారింది. ఇబ్రహీంపల్లి బస్‌స్టేజీకి సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ఓ మర్రిచెట్టుపై నుంచి పెద్ద కొమ్మ సోమవారం సాయంత్రం విరిగిపడింది. అది పూర్తిగా కిందపడిపోకుండా చెట్టుకు వేలాడుతూ రోడ్డుపై వెళ్లే వాహనాలకు ఇబ్బందిగా మారింది. ఈ విషయంపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించటంతో పోలీసులు వచ్చి దానిని తొలగించారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

జీపీ వర్కర్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య



అధికారికి వినతిపత్రం అందిస్తున్న జీపీ కార్మికులు

కేశంపేట: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందిని మల్టీపర్పస్ విధానంతో కాకుండా బిల్ కలెక్టర్లు, కారోబార్లు, కార్మికులుగా గుర్తించాలని ఏఐటీయూసీ అనుబంధ గ్రామ పంచాయతీ వర్కర్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యాక్రమానికి అనుమతివ్వాలని సోమవారం మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డికి జీపీ సిబ్బంది వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాంచంద్రయ్య మాట్లాడుతూ.. జీపీ సిబ్బందికి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. 2వ పీఆర్సీ పరిధిలోని గ్రామ పంచాయతీ సిబ్బందిని తీసుకొచ్చి జీఓ 60 ప్రకారం జీతాలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. జీఓ 51ని సవరించి జీపీల్లోపనిచేస్తున్న వారికి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్‌ను కల్పించాలని అయన డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికులు, అనారోగ్యానికి గురైన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలను అందించాలని, తమ సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది రవి, పద్మమ్మ, పరేష, అంజయ్య, జంగయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. మహాదానం

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



అన్నదాతను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

నందిగామ: మాలదారులకు అన్నదానం చేయడం మహాదానంతో సమానమని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో గల అయ్యప్ప ఆలయంలో మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కఠిన నియమాలు పాటిస్తూ 41రోజుల పాటు దీక్షను చేపట్టిన అయ్యప్ప మాలదారులకు అన్నదానం చేయడం అదృష్టమన్నారు. అనంతరం అన్నదాతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు కుమార్‌గౌడ్, అశోక్‌గౌడ్, గురుస్వాములు తుమ్మల నర్సింహ, చించేటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట

డీఎల్పీఓ లక్ష్మీనారాయణ



విద్యార్థులతో కలిసి భోజనాలు చేస్తున్న అధికారులు

షాబాద్: విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని డీఎల్పీఓ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కైట్ కళాశాలలో కొనసాగుతున్న మహాత్మాజ్యోతిపూలే గురుకుల పాఠశాల, కళాశాలలోని హాస్టళ్లలో నూతన డైట్ మెనూ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఏకరీతిలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించేలా వారికి డైట్ చార్జీలను పెంచిందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సూర్యనారాయణ, ఎంపీఓ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శివరంజని, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం

కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంద్రూ



మాట్లాడుతున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జిల్లా నాయకుడు అంద్రూ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో ఆయన కాంగ్రెస్ నాయకుడు, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు సంగరి మల్లేశ్, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు మక్బూల్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆంద్రూ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ సంక్షేమ హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలం నుంచి ఎస్సీ రిజర్వేషన్ అవకాశం వస్తే జెడ్పీటీసీగా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

షాద్‌నగర్: అదిలాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీల్లో షాద్‌నగర్‌లోని ఠాగూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల డైరెక్టర్ రవిప్రకాశ్ హర్కాల్ తెలిపారు. 31 జిల్లాలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా.. ఠాగూర్ పాఠశాలకు చెందిన మహ్మద్ జోహెబ్ షరీక్, ఫైజల్, దెబాదిత్యలు పాల్గొని ప్రతిభ కనబర్చి ఆరో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. విద్యార్థులను అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అభినందించారు. ఈసందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించారు.

చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

నందిగామ: ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి సూచించారు. మండల పరిధిలోని చేగూరులో సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకారంతో భాస్కర లా కళాశాల ఆధ్వర్యంలో గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి శ్రీదేవి హాజరై మాట్లాడుతూ.. సమాజంలో నిత్యం జరుగుతున్న పలు సంఘటనలు, వాటి పర్యావసనాలు, చట్టాలు, కోర్టులు ఇచ్చే తీర్పులు, సెక్షన్లు తదితర వాటిపై అవగాహన అవసరమన్నారు. అంతేగాకుండా అనవసరమైన విషయాలలో జోక్యం చేసుకోవద్దని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దని సూచించారు. కార్యక్రమంలో లా కాలేజీ ప్రిన్సిపాల్ భగవద్గీత, పారా లీగల్ వలంటీర్లు సంజీవ, బాల్‌రెడ్డి, లా కాలేజీ అధ్యాపకులు అనిల్‌సింగ్, స్నేహలత, విజేత రాణి, హృషికేశ్, పటాన్‌ఖాన్, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రాజురెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.